# జన జాగృతి

ఎడిటర్ : రామ్‌కుమార్ దుగ్యాల

పేజీలు : 4

Daily News Digital e-paper

సంపుటి : 01 | సంచిక : 72 | మంగళవారం 15.04.2025 | వెల : 5


# మహనీయులను అగౌరవపరచడం మంచిది కాదు!

- కేసీఆర్‌పై కోపంతో సీఎం 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్దకు రాలేదు..
- తెలంగాణలో కేసీఆర్ గుర్తులను ఎవరూ చెరపలేరు..
- ముఖ్యమంత్రిపై బీఆర్ ఎస్ ఎమ్మెల్సీ ఫైర్



హైదరాబాద్, జన జాగృతి: మహనీయులను అగౌరవ పరచడం ఏమాత్రం మంచిది కాదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని 125 అడుగుల ఎత్తయిన అంబేద్కర్ విగ్రహానికి బీపీ మండల్ మనవడు ప్రొఫెసర్ సూరజ్ యాదవ్ మండల్, ఇతర నాయకులతో కలిసి ఆమె నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, కేసీఆర్ మీద అక్కసుతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి నివాళులర్పించలేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ గారి ఆనవాళ్లు చెరిపేస్తానని ముఖ్యమంత్రి చెప్పారు.. అందుకే ఆయన విగ్రహం వద్దకు రాలేదని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఇది సరైన పద్ధతి కాదన్న విషయం ముఖ్యమంత్రి గమనంలోకి తీసుకొని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సమన్యాయం చేయాలని కేసీఆర్ ప్రభుత్వంలో అడుగులు వేశామన్నారు. అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా నగరం నడిబొడ్డున కేసీఆర్ గారి ప్రభుత్వం ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయించిందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించలేదని, ముఖ్యమంత్రి, మంత్రులు అంబేద్కర్ విగ్రహానికి దండ వేయకుండా ఆయనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మహనీయుడు విగ్రహం వద్ద లైట్లు కూడా వేయకుండా చీకట్లో మగ్గేలా చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం తీరును ప్రజాస్వామికవాదులంతా తప్పుబట్టిన తర్వాత ఈరోజు అంబేద్కర్ జయంతి సందర్భంగా కేబినెట్ వచ్చి దండవేయడాన్ని హర్షిస్తున్నామని అన్నారు.

### అంబేద్కర్ ది ఉక్కు సంకల్పం

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ది ఉక్కు సంకల్పమని అన్నారు. ఆయనను ఎన్ని కష్టాలకు గురి చేసినా వెనక్కి తగ్గలేదని.. విదేశాలకు వెళ్లి ఉన్నత ఉద్యోగం చేస్తూ వివక్ష లేకుండా మహరాజులా బతికే అవకాశమున్నా వెళ్లలేదన్నారు. తాను ఒక్కడిని పక్కకు జరిగితే తన జాతి ప్రజలపై జరుగుతోన్న వివక్ష, అణచివేత కొనసాగుతూనే ఉంటుందని.. వాటిని తొలగించాలన్న ఉక్కు సంకల్పంతో పని చేసిన మహనీయుడు ఆయన అని కొనియాడారు. అంబేద్కర్ ఒక్క దళితులకు మాత్రమే దేవుడు కాదని ఓబీసీలు, మహిళల హక్కుల కోసం పాటు పడ్డ మహావ్యక్తి అన్నారు. మానవ హక్కుల కోసం పోరాడిన గొప్ప మనిషి అన్నారు. భారత రాజ్యాంగం రాసే క్రమంలో ఆయన గురించి అనేక మంది అనేక రకాలుగా మాట్లాడారని.. ఆ రోజు మన దేశంలో అంబేద్కర్ కన్నా ఎక్కువ చదువుకున్న, లోకజ్ఞానం, ప్రపంచ జ్ఞానం తెలిపిన వ్యక్తి ఇంకొకరు లేకుండేనని గుర్తు చేశారు.



### పోలీసుల అత్యుత్సాహం

125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించకుండా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహా బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. విగ్రహం మొదటి అంతస్తులోకి వెళ్లి నివాళులర్పిస్తామని నాయకులు చెప్పినా పోలీసులు అనుమతించలేదు. మొదటి అంతస్తులోకి వెళ్లేందుకు అనుమతి లేదని అడ్డు తగిలారు. దీంతో ఎమ్మెల్సీ కవిత సహా నాయకులంతా గ్రౌండ్ ఫ్లోర్ లో బైఠాయించి జై భీమ్ నినాదాలు చేశారు. అనంతరం మొదటి అంతుస్తులోకి వెళ్లి నివాళుర్పించేందుకు పోలీసులు అనుమతించారు. తెలంగాణ రాష్ట్రంలో ఈరోజు మనమందరం నిలబడి ఉన్నామంటే అది కేవలం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భిక్ష అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఖైరతాబాద్ లోని బడా గణేశ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒక ప్రాంతం జనాభా తక్కువగా ఉన్నా ఆ ప్రాంత ప్రజల కోరిక న్యాయబద్ధమైతే చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు ఆ రాష్ట్ర అసెంబ్లీతో పని లేకుండా పార్లమెంట్ లో బిల్లు పాస్ అయితే రాష్ట్రం ఏర్పాటు చేయొచ్చని ఆయన ఆర్టికల్ -3లో పొందు పరిచారని గుర్తు చేశారు. అంబేద్కర్ పొందు పరిచిన ఆ క్లాజు లేకుండా ఏ నాటికి కూడా ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణ ప్రత్యేక వేరు కాకుండేనని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అయిన కొద్దికాలానికే దేశంలోనే నంబర్ వన్ గా నిలబడ్డామని తెలిపారు. ఆయన స్ఫూర్తితో తెలంగాణ అభివృద్ధిలో మనమందరం భాగస్వాములం అవుదామని పిలుపునిచ్చారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేసుకున్నామని.. ఆయన మనవడు ప్రకాశ్ అంబేద్కర్ ను అతిథిగా పిలిచి ఆ విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ రోజు ఓబీసీ రిజర్వేషన్లు అమలవుతున్నాయంటే అందుకు కారణం బీపీ మండల్ అని, ఆయన మనవడు ప్రొఫెసర్ సూరజ్ మండల్ అతిథిగా పాల్గొనడం సంతోషకరమని అన్నారు.

# అమలులోకి ఎస్సీ వర్గీకరణ చట్టం

### గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చట్టం అమల్లోకి వచ్చింది. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన జీవోను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఎస్సీలకు ఇప్పటివరకు గంపగుత్తగా అమలైన రిజర్వేషన్లను ఇక నుంచి వర్గీకరణ ప్రకారం అందనున్నాయి. మొత్తం 56 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా విభజించింది. ఏ గ్రూప్‌లో 15 ఉప కులాలు ఉండగా.. వారికి 1 శాతం రిజర్వేషన్లు, బీ గ్రూప్‌లో ఉన్న 18 కులాలకు 9 శాతం, సీ గ్రూప్‌లో ఉన్న 26 కులాలకు 5 శాతం రిజర్వేషన్లు వర్తించనున్నట్లు పేర్కొంది. ఇకపై గ్రూపులు, కులాల ప్రాధాన్యత క్రమంలో ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను భర్తీచేయనున్నారు. ఈ గెజిట్ తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో అందుబాటులో ఉందని వెల్లడించింది. ఎస్సీ వర్గీకరణ మంత్రివర్గ ఉపకమిటీ చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మంత్రులు పొన్నం, పొంగులేటి, దామోదర రాజనర్సింహ వర్గీకరణ అమల్‌కాపీని సీఎంకి అందజేశారు.






# భూభారతితో భూముల భద్రత



- భూవివాదాలకు ఇక చెల్లు
- భూ భారతితో అది సాధ్యం
- అమలు బాధ్యత రెవెన్యూ సిబ్బందిదే
- పోర్టల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జన జాగృతి: భూవివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగానే తమ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న తపనతోనే ఈ చట్టాన్ని వారికి అంకితం చేస్తోందన్నారు. భూభారతి పోర్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. “తెలంగాణ ప్రాంతంలో వందల ఏళ్ల నుంచి భూమి చుట్టూనే పోరాటాలు జరిగాయి. నాడు కుమురం భీం ‘జల్ జంగల్ జమీన్’ నినాదంతో పోరాటం చేసినా.. నిజాంకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య పోరాటం చేసినా భూమితో వారికున్న అనుబంధం నుంచి పుట్టుకొచ్చినవే. ఆ పోరాటాల నుంచి ఏర్పడిన రెవెన్యూ చట్టాలు భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం, అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ భావించారు. భూమిపై చర్చ ఎప్పుడొచ్చినా బూర్గుల రామకృష్ణారావు దగ్గరి నుంచి పీవీ నరసింహారావు వరకు చేపట్టిన భూసంస్కరణలే గుర్తుకొస్తాయి. సీలింగ్ చట్టం తీసుకొచ్చి.. జమీందార్లు, జాగీర్దార్ల నుంచి లక్షల ఎకరాలు తీసుకొని పేదలకు ఆత్మగౌరవం తెచ్చేలా పంచింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమే. దాదాపు 65 ఏళ్లు 69 లక్షల భూకమతాలకు సంబంధించిన రికార్డులను రెవెన్యూ సిబ్బందే కాపాడారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉన్నఫళంగా రెవెన్యూ చట్టాలను మార్చాలని పాలకుల మెదడులో కలిగిన ఆలోచనతో ప్రవేశపెట్టిన ధరణి ఒక పీడకలలా మారింది. ఒక తహసీల్దార్‌పైనే పెట్రోల్ పోసి తగలపెట్టే పరిస్థితి వచ్చింది. ధరణితో వచ్చిన మార్పులు ఇబ్రహీంపట్నంలో జంట హత్యలకు కారణమయ్యాయి. సిరిసిల్లలో తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఓ మహిళ తన తాళిబొట్టును లంచంగా ఇచ్చింది. ఈ సమస్యలన్నింటికీ రెవెన్యూ సిబ్బందే కారణమని చెప్పి నాటి పాలకులు వారిని దోషులుగా, దోపిడీదారులుగా చిత్రీకరించారు. గత ప్రభుత్వ హయాంలో చట్టాలను కొందరికే చుట్టాలుగా మార్చి వేల ఎకరాలను కొల్లగొట్టే ప్రయత్నం జరిగింది వాస్తవం కాదా? అందుకే మేం అధికారంలోకి వస్తే ధరణిని బంగాళాఖాతంలో విసిరేస్తామని చెప్పాం. పేదలకు చుట్టంగా ఉండాలనే ఈరోజు నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకొచ్చాం. కోదండరెడ్డి నేతృత్వంలో వివిధ రాష్ట్రాల్లోని చట్టాలపై అధ్యయనం చేయించాం. నిజాం కాలం నుంచి అమలైన చట్టాలనూ పరిశీలించిన తర్వాతే భూ భారతిని తెచ్చాం. రెవెన్యూ అధికారులు ముందుగా నాలుగు పైలట్ మండలాల్లోని గ్రామాలకు వెళ్లి ప్రజల నుంచి సమాచారం సేకరిస్తారు. ఖమ్మం జిల్లా పాలేరులో లక్ష మందితో బహిరంగ సభ పెట్టి భూ భారతి చట్టాన్ని ప్రజలకు అంకితం చేద్దామని మంత్రి పొంగులేటి అన్నారు. కానీ, ఈ చట్టాన్ని ప్రజల్లోకి చేర్చేది రెవెన్యూ సిబ్బంది కాబట్టి వారినే పిలవాలని సూచించా. అందుకే ఈరోజు మీరు ప్రేక్షకులు కాదు.. అతిథులు. రెవెన్యూ సిబ్బందిని మా ప్రభుత్వం సంపూర్ణంగా విశ్వసిస్తోంది. దొంగలుగానో, దోపిడీదారులుగానో చిత్రీకరించదలుచుకోలేదు. అంతటా ఉన్నట్లు రెవెన్యూశాఖలోనూ ఎవరైనా తప్పు చేయొచ్చు. అంతమాత్రాన శాఖను మొత్తం ప్రజల ముందు దోషిగా నిలబెట్టి.. అవమానించేలా మాట్లాడే విధానానికి నేను వ్యతిరేకం. రెవెన్యూశాఖను అప్పటి ముఖ్యమంత్రి శాసనసభ లోపల, బయట ఎలా దూషించారో మీరు చూశారు. అలాంటి వారిని సమాజానికి దూరంగా పెట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

### ఎసైన్‌మెంట్ కమిటీలను పునరుద్ధరిస్తాం: భట్టి

ఆత్మగౌరవంతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల్ని అల్లకల్లోలం చేస్తూ తెచ్చిందే ధరణి చట్టం. భూమికి, మనిషికి విడదీయలేని బంధముంటుంది. దాన్ని అలాగే కొనసాగించాలి. ధరణి చట్టంతో దాన్ని తెంచేందుకు యత్నించారు. రైతుల హక్కుల్ని కొందరు పెత్తందార్ల కాళ్ల దగ్గర తాకట్టు పెట్టేలా నాటి పాలకులు ధరణిని రూపొందించారు. నాడు కాంగ్రెస్ పంచిన 24 లక్షల ఎకరాల భూములకు హక్కుల్లేకుండా చేశారు. సీఎల్పీ నేతగా నేను పాదయాత్ర చేసినప్పుడు ఆ సమస్యల్ని రైతులు చెప్పడంతో ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని ఆనాడే చెప్పాం. గతంలో ఓ సామాన్యుడు తహసీల్దార్‌పై పెట్రోల్ పోసి తగలబెట్టి.. తనను తాను చంపుకునే ప్రయత్నం చేసిననాడే ధరణిని తీసేస్తామన్నాం.

# అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చే సత్తా ఎవరికీ లేదు..

**ఎంపీ ఈటల రాజేందర్**



హైదరాబాద్, జన జాగృతి బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మార్చే శక్తి, సత్తా ఎవరికీ లేదని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీపై అబద్ధపు ప్రచారాలతో కాంగ్రెస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని మండిపడ్డారు. సోమవారం కీసరలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని ఏ పార్టీలు అధికారంలో ఉన్న తూ.చ తప్పకుండా పాటించాలని తెలిపారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించిందని ఆరోపించారు. ఆయనకు భారతరత్నను కాంగ్రెస్ తిరస్కరిస్తే వీపీ సింగ్ ప్రభుత్వం ఇచ్చిందని స్పష్టం చేశారు. బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి దేశమంతా జరుపుకుంటుందని, ఇంత గొప్పగా దేశంలో ఎవరి జయంతి జరగదని కొనియాడారు. ప్రపంచంలో ఇన్ని విగ్రహాలున్న నాయకుడు కూడా ఆయననే అని చెప్పారు. అంబేద్కర్‌ని కేవలం దళితులకు రిజర్వేషన్లు కల్పించిన నాయకుడని చిన్నగా చూపే ప్రయత్నం తప్పన్నారు. ఆయన ఈ దేశానికి ఎలాంటి ఆర్థిక వ్యవస్థ ఉండాలో చెప్పారు. రిజర్వ్ బ్యాంక్, బ్యాంకింగ్ వ్యవస్థలు ఇచ్చారు. 75 ఏళ్ల తర్వాత కూడా ప్రపంచంలో గొప్ప ప్రజాస్వామిక వ్యవస్థగా మనం ఉన్నామంటే దానికి కారణం అంబేద్కరేనని వివరించారు. మన పక్కన ఉన్న పాకిస్తాన్, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్ లో ఏం జరుగుతుంది చూస్తున్నాం.. 140 కోట్ల జనాభా.. వివిధ కులాలు, వైవిధ్యాలు, అంతరాలు, భాషలు, సంస్కృతులు ఉన్నా మనం చల్లగా ఉండడమే కాకుండా, ప్రపంచానికి ఆదర్శంగా ఉండడానికి పునాదులు వేసిన మహనీయుడు ఈటల తెలిపారు. ఆయన కేవలం హక్కుల గురించి మాత్రమే కాదు.. ఆయన బ్రతుకులను స్పృశించారని అన్నారు.

# చంచల్ గూడ జైల్లో రీల్స్ చేసిన ఖైదీ

రాష్ట్రంలోని జైళ్ళలో భద్రతా లోపాలు మరోసారి బయట పడ్డాయి . రాష్ట్ర రాజధానిలోని జైల్లో పోలీసుల నిఘా మచ్చుకైనా కానరాని ఘటన హైదరాబాద్ లో చోటు చేసుకుంది. ఓ కేసులో రిమాండ్ లో ఖైదీని కలిసేందుకు వచ్చిన అతని స్నేహితులు.. మూలాఖత్ లో రీల్స్ చేశారు. ఆ రీల్ కాస్త వైరల్ అవడంతో ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలకు దిగారు. పాతబస్తీకి చెందిన అహ్మద్ జాబ్రీ ఈనెల 11న దారిదోపిడీ కేసులో అరెస్టయ్యి.. చంచల్ గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. జాబ్రీని కలవడానికి అతని మిత్రబృందం జైలుకు వెళ్ళింది. అక్కడ మూలాఖత్ సమయంలో జాబ్రీతో కలిసి రీల్స్ చేసి, ఇన్స్టాగ్రాంలో అప్లోడ్ చేశారు. ఈ రీల్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవడంతో.. పోలీసు ఉన్నతాధికారులకు విషయం తెలిసి దిద్దుబాటు చర్యలకు దిగారు. రీల్స్ తీసిన నిందితుణ్ణి గుర్తించి, చాంద్రాయణగుట్ట పోలీసులకు అప్పగించారు సౌత్ ఈస్ట్ జోన్ పోలీసులు. అయితే జైల్లో పోలీసుల నిఘా లేకపోవడం వల్లే ఇలా జరిగిందని, జైల్లో కూడా నేరస్తులు ఎంజాయ్ చేస్తున్నారంటూ నెటిజన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# 16న జపాన్‌కు సీఎం రేవంత్

హైదరాబాద్, జన జాగృతి: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ నెల 16న జపాన్ పర్యటనకు బయ ల్దేరి వెళ్లనున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో పాటు రాష్ట్ర అధికారుల ప్రతినిధి బృందం సీఎం వెంట ఉంటారు. ఏప్రిల్ 16 నుండి 22 వరకు పర్యటన కొన సాగనుంది. టోక్యో, మౌంట్ ఫుజి, ఓసాకా, హీరోషిమాలో ముఖ్యమంత్రి బృందం పర్య టించనుంది. ఓసాకా వరల్డ్ ఎక్స్‌పో -2025లో తెలంగాణ పెవిలియన్‌ను సీఎం ప్రారంభించనున్నారు. ఆ దేశానికి చెందిన ప్రముఖ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, పలువురు ప్రతిని ధులతో ముఖ్యమంత్రి బృందం సమావేశం కానుంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రా మిక, సాంకేతిక సహకారంపై ప్రధానంగా చర్చలు జరపనుంది.

## అప్పటి నోటిఫికేషన్‌లకు ఎస్సీ రిజర్వేషన్లు వర్తించవు: ఉత్తమ్




హైదరాబాద్, జన జాగృతి: తెలంగాణలో విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామన్నారు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి. ఎస్సీ వర్గీకరణ అమలు చరిత్రాత్మకమైనదని చెప్పుకొచ్చారు. ఈరోజు నుంచే ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు అమలవుతాయని స్పష్టం చేశారు. త్వరలోనే అన్ని నోటిఫికేషన్లు ఎస్సీ రిజర్వేషన్ల అమలుతో విడుదల అవుతాయని తెలిపారు. ఇదే సమయంలో గత ఏడాది ఫస్ట్ ఆగస్టు కు ముందు ఇచ్చిన నోటిఫికేషన్లకు ఈ రిజర్వేషన్లు వర్తించవు అని క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ జీవో తొలి కాపీనీ మంత్రులు సీఎం రేవంత్ రెడ్డికి సచివాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో మంత్రులతో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..‘ఎస్సీ రిజర్వేషన్లపై ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అమలు అవుతాయి. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ కు లోబడి ఎస్సీ రిజర్వేషన్లు అమలు అవుతాయి. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల పై అందరికీ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నాం.

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం.. మోదీ వ్యాఖ్యలు సత్యదూరం: ఎంపీ చామల

హైదరాబాద్, జన జాగృతి: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై ప్రధాని మోదీ వాస్తవాలకు దూరంగా మాట్లాడారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కంచ గచ్చిబౌలి భూముల అంశంలో అందరూ అవాస్తవాలు మాట్లాడుతున్నారని అన్నారు. ఫేక్ వీడియోలు సృష్టించిన వారిపై ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ వేయగానే.. అందరూ వాటిని డిలీట్ చేశారని తెలిపారు. “హరియాణా ప్రజలను ప్రధాని మోదీ తప్పుదోవ పట్టిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీని దూషించాలని మోదీ ఈ విధంగా మాట్లాడుతున్నారు. తెలిసీ తెలియని సమాచారంతో ఆయన మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలు మీ కార్యాలయం ద్వారా తెలుసుకొని మాట్లాడండి. సన్న బియ్యం, భూభారతి లాంటి మంచి కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. బీసీ ప్రధాని అంటారు కదా.. మరి బీసీ కులగణన మీద మోదీ ఎందుకు మాట్లాడటం లేదు” అని చామల ప్రశ్నించారు.





# నిత్య సత్య స్ఫూర్తి అంబేద్కర్ !

- రాష్ట్ర వ్యాప్తంగా జయంతి వేడుకలు
- ఎగిరిన నీలి జెండాలు

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బీఆర్ డాక్టర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం తెలంగాణవ్యాప్తంగా వేడుకలు జరిగాయి. హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పలువురు మంత్రులు, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మరో కేంద్ర మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, తెలంగాణ భవన్‌లో కేటీఆర్, మరోచోట ఎమ్మెల్సీ కవిత తదితరులు అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళి అర్పించారు. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు.











## సల్మాన్‌ఖాన్‌కు
# మరోసారి బెదిరింపులు



**కారును పేల్చేస్తామంటూ వాట్సాప్ ద్వారా సందేశం**
**వోర్లీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**

బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌కు బెదిరింపుల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా సల్మాన్ ప్రయాణించే కారును బాంబు పెట్టి పేల్చేస్తామంటూ వోర్లీలోని ముంబై ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయానికి సోమవారం గుర్తు తెలియని నిందితుడు వాట్సాప్ ద్వారా సందేశం పంపించడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో వోర్లీ పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు అతడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. సల్మాన్‌కు బెదిరింపులు ఎక్కడి నుంచి వచ్చాయన్నది కూడా ఆరా తీస్తున్నారు. సల్మాన్ నివాసం ఉంటున్న ముంబైలోని బాంద్రాలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కొంతకాలంగా సల్మాన్‌ను చంపేస్తామంటూ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి హెచ్చరికలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈసారి వచ్చిన బెదిరింపుల వెనుక లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హస్తం ఉందా? అని పోలీసులు అనుమానిస్తున్నారు. గతేడాది సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట వద్ద ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. అంతకుముందు పన్వేల్ ఫామ్‌హౌస్‌లోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించడం అప్పట్లో కలకలం రేపింది. సల్మాన్‌కు బెదిరింపులు  ఎక్కువ కావడంతోనే మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు వై ప్లస్ క్యాటగిరీ భద్రతను కల్పించింది. 1998లో కృష్ణ జింకలను వేటాడటంతో అప్పట్లో పోలీసులు సల్మాన్ ఖాన్‌పై వణ్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో సల్మాన్‌కు జైలు శిక్ష పడినప్పటికీ బెయిల్‌పై బయటకు వచ్చారు. సల్మాన్ బెయిల్‌పై బయటకు రావడాన్ని అటవీ సంరక్షకులుగా చెప్పుకునే బిష్ణోయ్ తెగకు చెందిన వారికి నచ్చలేదు. అప్పటి నుంచి సల్మాన్ ఖాన్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్నారు. తాము ఎంతగానో ఆరాధించే కృష్ణ జింకను హత మార్చిన సల్మాన్‌ను చంపేవరకు తాము విశ్రమించబోమని బిష్ణోయ్ తెగ హెచ్చరించడం అప్పట్లో సంచలనం కలిగించింది.

## సినీ జాగృతి

# నా గురించి నువ్వేమీ బాధపడకు బ్రో !



అందాల భామ నిధి అగర్వాల్ 'ఇస్మార్ట్ శంకర్' తర్వాత 'హీరో' సినిమా చేసింది. తమిళంలో మూడు సినిమాలు చేసింది. ప్రస్తుతం ఆమె కథానాయికగా నటించిన 'హరిహరవీరమల్లు', 'ది రాజాసాబ్' చిత్రాల విడుదల కోసం ఎదురుచూస్తోంది. ఇవి తప్ప ఆమె చేతిలో ఉన్న సినిమాలేవీ లేనట్టుంది. నిధి అగర్వాల్ నుంచి వరుస సినిమాలు రాకపోవడంపై ఓ నెటిజన్ విమర్శనాత్మక వ్యాఖ్య చేశాడు. నిధి తర్వాత ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన యువ నటి శ్రీలీల ఫిల్మోగ్రఫీతో పోలుస్తూ వ్యంగ్యంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. '2019లో విడుదలైన 'ఇస్మార్ట్ శంకర్' తర్వాత ఆమె ఏం చేసింది? ఎన్ని సినిమాలు చేసింది? 2021లో వచ్చిన శ్రీలీలను చూడండి 20 సినిమాలు చేసింది" అంటూ అతడు రాసుకొచ్చిన పోస్ట్ నిధి కంట పడింది. దీంతో ఆమె తనదైన శైలిలో అతన్ని సమాధానపరిచింది. తన గురించి ఏమాత్రం బాధపడొద్దంటూ అతన్ని కోరింది. 'మంచి స్క్రిప్ట్‌లు అని నమ్మిన తర్వాతే అలాంటి వాటికే నేను సంతకం చేస్తున్నా. ఈ విషయంలో టైమ్ తీసుకుంటున్నా.. అయితే, ఈ నిర్ణయం తీసుకునే క్రమంలో నేను కొన్ని సార్లు తప్పు అయి ఉండొచ్చు అది వేరే విషయం. కానీ, నా అభిప్రాయమల్లా మంచి సినిమాల్లోనే భాగం కావాలన్నదే! వరుస సినిమాలు చేసేయాలనే తొందర నాకేమీ లేదు. ఇంకో విషయం ఏంటంటే.. నేను ఈ ఇండస్ట్రీలోనే ఉండాలనుకుంటున్నా. కాబట్టి, బ్రదర్.. నా గురించి నువ్వు ఏమీ బాధపడకు" అని ఆమె రిప్లు ఇచ్చింది.

## క్రీడా జాగృతి





# చెన్నైసూపర్ కింగ్స్ ద్వితీయ విజయం

**జట్టును గెలిపించిన ధోని, దూబే**
**5 వికెట్ల తేడాతో లక్నో ఓటమి**
**నేడు పంజాబ్‌తో కోల్‌కతా 'ఢీ'**

లక్నో, ఏప్రిల్ 14: ఐపీఎల్ 18వ సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ నాలుగు వరుస ఓటముల తర్వాత ఎట్టకేలకు విజయాన్ని రుచి చేసింది. సోమవారం లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై 5 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై గెలుపు నమోదు చేసుకుంది.  తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. కెప్టెన్ రిషబ్ పంత్ (63) సీజన్‌లో తొలి హాఫ్ సెంచరీ సాధించగా.. మార్ష్ (30) పర్వాలేదనిపించాడు. చెన్నై బౌలర్లలో పతీరానా, జడేజా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ 19.3 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. శివమ్ దూబే (43 నాటౌట్), ధోనీ (26 నాటౌట్) అజేయంగా నిలిచి చెన్నైని గెలిపించారు. లక్నో బౌలర్లలో రవి బిష్ణోయ్ 2 వికెట్లు పడగొట్టగా.. ఆవేశ్ ఖాన్, దిగ్వేశ్, మార్క్రమ్ తలా ఒక వికెట్ తీశారు. నేడు జరగనున్న మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడనున్నాయి.

### మెరిసిన రిషబ్ పంత్

టాస్ గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్ లక్నోను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్ మార్క్రమ్ (6) క్రీజులో ఎక్కువసేపు నిలవలేకపోయాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న నికోలస్ పూరన్ (8) అన్షుల్ కంబోజ్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరగడంతో లక్నోకు దెబ్బ పడింది. ఈ దశలో మిచెల్ మార్ష్‌కు జత కలిసిన పంత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఈ ఇద్దరు ఆచుతూచి ఆడడంతో పరుగులు రావడం తగ్గిపోయాయి. మూడో వికెట్‌కు 50 పరుగులు జోడించిన అనంతరం జడేజా బౌలింగ్‌లో మార్ష్ క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన ఆయుశ్ బదోని (22), అబ్దుల్ సమద్ (20)ల సహకారంతో పంత్ లక్నో స్కోరును 150 దాటించాడు. చివర్లో పంత్ ఔట్ కావడంతో లక్నో 166 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేసింది.

### గెలిపించిన ధోని, దూబే

అనంతరం ఛేదనలో చెన్నైకి శుభారంభం లభించింది. షేక్ రషీద్ (27), రచిన్ రవీంద్ర (37) తొలి వికెట్‌కు 4.5 ఓవర్లలో 52 పరుగులు జోడించారు. వీరిద్దరు ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన రాహుల్ త్రిపాఠి (9), జడేజా (7) పేలవ ఫామ్‌ను కంటిన్యూ చేశారు. అయితే శివమ్ దూబే (39 నాటౌట్), ధోనీ (26 నాటౌట్) ఆఖర్లో 53 పరుగులు జోడించి చెన్నైను విజయతీరాలకు చేర్చారు.

